క్లుప్తంగా

30 నుంచి నవమి ఉత్సవాలు

వెదురుకుప్పం: మండలంలోని పెరుమాళ్లపల్లెలో ఉన్న రామాలయంలో ఈ నెల 30 నుంచి నవమి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు ఆనందరెడ్డి తెలిపారు. 9 రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు, భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతిరోజూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు ఉంటాయని తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం



కొత్తబోరు మోటారును ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ అన్బళగన్, సర్పంచ్ అయ్యప్ప

పాలసముద్రం : మండల పరిధిలోని పాలసముద్రం దళితవాడ ప్రజలకు తాగునీటి సరఫరా కోసం బోరు మోటారు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించినట్లు జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, సర్పంచ్ అయ్యప్ప తెలిపారు. బుధవారం వారు కొత్త మోటారును ప్రారంభించి తాగునీటి సమస్యను పరిష్కరించారు. దళితవాడకు గతంలో ఉన్న తాగునీటి బోరులో నీరు రాకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ నిధులతో కొత్తబోరు వేశామన్నారు. మోటారు అమర్చి తాగునీరు సరఫరా చేశారు. కార్యక్రమంలో వార్డు మెంబర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాలగురునాథీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



సుందరంగా అలంకరించిన స్వామివారిని మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

పాలసముద్రం : తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా బుధవారం మండల పరిధిలోని ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగింది. మండల పరిధిలోని ప్రజలు ఉగాది పండుగను ఉదయం తలస్నానం చేసి కొత్తదుస్తులు ధరించి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బాలగురునాథీశ్వరస్వామికి గ్రామస్తులు సుగంధ పుష్పాలు, పూజాసామగ్రిని ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. వేదపండితులు స్వామివారిని భక్తులు తీసుకొచ్చిన పూజాసామగ్రితో అలంకరించి ప్రత్యేక పూజలు, దీపారాధన చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

తల్లిపాలు శిశువుకు అమృతం



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మోహన్‌కృష్ణ

పాలసముద్రం : తల్లిపాలు శిశువులకు అమృతంతో సమానమని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. బుధవారం పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పుట్టిన శిశువులకు 6 నెలల వరకు కేవలం చనుబాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఆరు నెలల తరువాత తృణధాన్యాలు, కిచిడీ, పొంగలి, పప్పులు, పండ్లు ఇవ్వాలన్నారు. తరువాత క్రమక్రమంగా పిల్లలు తినే ఆహారం మోతాదును పెంచుకోవాలని తెలిపారు. గర్భిణులు ప్రసవం వరకు నెలసరి వైద్య పరీక్షలు తప్పక చేసుకోవాలని తెలిపారు. అనంతరం వారికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మురళి, సుశీల, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నారాయణవనం: ఉగాదిని పురస్కరించుకుని మండలంలోని పాలమంగళం ఉత్తరపుకండ్రిగలో బుధవారం సీతారాముల కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఉత్సవ మూర్తులకు అభిషేకాలు నిర్వహించి, సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించారు. వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా సీతారాములకు కల్యాణాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు పంచాంగానికి పూజలు చేసి రాశిఫలాలను చదివి వినిపించారు. భక్తులకు ఉగాది పచ్చడి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు.

కొత్తశోభను తెచ్చే శోభకృత్

- ఉగాది సందర్భంగా ప్రత్యేక పూజలు
- కిటకిటలాడిన ఆలయాలు
- పంచాంగ శ్రవణం పఠించిన పండితులు
- ఈ ఏడాది కూడా ప్రజలకు అంతా మంచి జరగాలి
- మంత్రి ఆర్‌కే రోజా



విజయవాడలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న మంత్రి ఆర్‌కే రోజా



ప్రత్యేక చందనాలంకరణలో ప్రసన్న ఆంజనేయస్వామి

నగరి : నగరి మున్సిపల్, మండల పరిధిలోని ఆలయాల్లో బుధవారం ఉగాది పూజలు వైభవంగా జరిగాయి. కరియమాణిక్య స్వామి ఆలయంలో శోభకృత్ నామ ఉగాదిని పురస్కరించుకుని విశేష పూజలు చేయగా పురోహితులు ప్రసాద్‌శర్మ పంచాంగ శ్రవణం చేశారు. రాశుల వారీగా ఏర్పడే ఫలితాలను వివరించారు. కొత్త సంవత్సరం పేరులోనే శోభ ఉండడం వల్ల ఈ సంవత్సరం దేశంలో అన్ని విధాలుగా శోభిల్లుతూ ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పంచాంగ శ్రవణం విని శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్య స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారి వెంకటరమణ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ పరిధిలోని టీఆర్ కండ్రిగలో కన్నుల దేవత దేశమ్మ ఆలయంలోని బాలాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయ సమీపంలో శ్రీప్రసన్న వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేయగా భక్తులను ఆకట్టుకుంది. కరకంఠేశ్వర స్వామి ఆలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రదక్షిణ చేసి స్వామివారిని దర్శించుకుని కర్పూర హారతులు స్వీకరించారు. పాతభజన గుడి వీధిలోని కోదండ రామాలయంలో, భేరి వీధి రామాలయంలో ఉగాది పురస్కరించుకుని సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వామివారికి చేపట్టిన అలంకరణలు ప్రత్యేకంగా నిలిచాయి. పట్టణ పరిధిలోని ఓంశక్తి ఆలయంలో, సాయిబాబా ఆలయంలో, హనుమతేశ్వర స్వామి ఆలయంలో ఉగాది పూజలు నిర్వహించారు.

'శోభకృత్' శుభాలను ఇవ్వాలి

శోభకృత్ నామ సంవత్సరం శుభఫలితాలను ఇవ్వాలని మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆమె నియోజకవర్గ ప్రజలకు బుధవారం ఓ ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. జగనన్న పాలనలో ఈ ఏడాది కూడా రాష్ట్ర ప్రజలకు అంతా మంచే జరుగుతుందని ఆకాంక్షించారు. ఈ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరి జీవితంలో వెలుగులు నిండుతాయన్నారు. ఇలాగే ప్రజలు ఎప్పుడూ సుభిక్షంగా ఉండాలని వేంకటేశ్వరస్వామివారిని వేడుకున్నట్లు తెలిపారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: మండలవ్యాప్తంగా ప్రజలు తెలుగు సంవత్సరాది ఉగాదిని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయాన్నే తలస్నానం ఆచరించి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీడీనెల్లూరులోని గంగాధరేశ్వర స్వామి ఆలయం, శ్రీఅల్లిఎల్లమ్మ ఆలయం, వేపంజేరిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయాల్లో ఉగాది సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వేపంజేరిలో పంచాంగశ్రవణం చేశారు. ఉగాది పచ్చడి పంపిణీ చేశారు.

వెదురుకుప్పంలో...

వెదురుకుప్పం: తెలుగు సంవత్సరాది ఉగాదిని బుధవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా డీఆర్‌ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో శోభకృత్ నామ సంవత్సర సందర్భంగా విశేష పూజలు నిర్వహించి పంచాంగ శ్రవణం చేశారు. చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. కురివికుప్పం గ్రామదేవత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి ద్రౌపదీ మాన సంరక్షణ వీధి నాటక ప్రదర్శన ఆహూతులను అలరించింది. ఆలయాల్లో భక్తులకు ఉగాది పచ్చడి పంచిపెట్టారు.



కోదండ రామాలయంలో దేవతా ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ



ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి వారు



పుత్తూరు: ప్రత్యేక అలంకరణలో తరుణ గణపతి

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: పట్టణ ప్రజలు బుధవారం శోభకృత్ నామ ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం స్థానిక ధర్మరాజులస్వామి ఆలయం నుంచి ద్రౌపదీదేవి ఉత్సవ విగ్రహంతో పాటు మహిళలు పాల కలశాలతో ఊరేగింపుగా సదాశివేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని గీతా మందిరానికి చేరుకున్నారు. గీతామందిరంలో వెలసిన శ్రీకృష్ణ పరమాత్మకు భక్తులు స్వహస్తాలతో పాలాభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, అర్చనలు చేశారు. మధ్యాహ్నం ధర్మరాజుల స్వామి ఆలయ ఆవరణలో ప్రముఖ శల్య వైద్యులు ప్రతాప్‌రాజు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలను ధర్మరాజులస్వామి ఆలయ కమిటీ చైర్మన్ లారీమోహన్ పర్యవేక్షించారు. సాయంత్రం గీతామందిరంలో గీతా పారాయణం, భజనలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. పట్టణంలోని తరుణ గణపతి, ఆంజనేయస్వామి, సదాశివేశ్వరస్వామి, సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అన్ని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



నగరి కరియమాణిక్య స్వామి ఆలయంలో పంచాగం శ్రవణం చేస్తున్న ప్రసాద్‌శర్మ



పుత్తూరు: పాల కలశాలతో మహిళల ఊరేగింపు



వెదురుకుప్పం: ప్రత్యేక అలంకరణలో కొండమల్లీశుడు

ఆకట్టుకున్న ఉగాది ఆస్థానం



భక్తులను కటాక్షిస్తున్న అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వరుడు

వడమాలపేట : అప్పలాయగుంటలోని టీటీడీకి అనుబంధంగా వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శోభకృత్ ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమార ఆచార్యులు పంచాంగం శ్రవణం చేస్తూ ఉగాది ఆస్థానం నిర్వహించారు. ఉభయ నాంచారులతో ప్రసన్నవేంకటేశ్వరుని విశేషంగా అలంకరింపజేసి మేళతాళాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ మాడవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

పాడిపంటల వృద్ధికి ప్రతీక గో సంతతి

రామచంద్రాపురం: పాడిపంటల వృద్ధికి ప్రతీకగా గో సంతతి ఉందని ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామిజీ తెలిపారు. ఆయన బుధవారం సూరావారిపల్లి సమీపంలోని గొల్లపల్లి వద్ద ఉన్న గోశాలలో గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ మూగజీవులకు భక్తిశ్రద్ధలతో పూజలు చేయడం వలన సర్వశుభాలు కలుగుతాయని చెప్పారు. రైతులకు వ్యవసాయంలో గోవుల పాత్ర ఎంతో కీలకమైనదని గుర్తు చేశారు.

వాటర్ ప్లాంట్ల ఏర్పాటు హర్షణీయం



చెక్కును అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

శ్రీరంగరాజపురం : నియోజకవర్గంలో వాటర్‌ప్లాంట్ల ఏర్పాటుకు ఎస్‌ఎస్‌జే ఫ్యాక్టరీ సంస్థ ముందుకు రావడం అభినందనీయమని జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఎస్‌ఎస్‌జే షుగర్ ఫ్యాక్టరీ అనుబంధ సంస్థ అయిన సీఎస్‌ఆర్ ట్రస్ట్ వారి సౌజన్యంతో ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి సహకారంతో నియోజకవర్గంలో రూ.64 లక్షలతో 8 మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అందులో కార్వేటినగరం మండలంలోని కొల్లాగుంట, కేపీ అగ్రహారం, శ్రీరంగరాజపురం మండలంలో పెద్దతయ్యూరు, చిన్నతయ్యూరు, నల్లపల్లిలో ఏర్పాటు చేస్తారని చెప్పారు. అలాగే గంగాధరనెల్లూరు మండలంలోని చెర్లోపల్లి, ఎల్లమరాజుపల్లిలో, పెనుమూరు మండలంలోని కత్తరెడ్డిపల్లిలో ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ప్లాంట్ల ఏర్పాటులో భాగంగా మొదటి విడతగా సీఎస్‌ఆర్ ట్రస్ట్ సభ్యులు రూ.1 లక్షను అందించారు. కార్యక్రమంలో నాయకులు జనార్ధన్, మణి, బాబు, చంద్రరెడ్డి, దామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ టోర్నీ విజేతలుగా నిలవండి



రాష్ట్ర మహిళా ఫుట్‌బాల్ జట్టు సభ్యులతో జయప్రకాష్

పుత్తూరు రూరల్: గోవాలో ఈనెల 25 నుంచి ప్రారంభం కానున్న జాతీయ మహిళా ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో రాష్ట్ర జట్టు మెరుగైన ప్రదర్శన చేసి విజేతగా నిలవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ డి.జయప్రకాష్ ఆకాంక్షించారు. స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో గత వారం రోజులుగా జరుగుతున్న రాష్ట్ర సీనియర్ ఉమెన్ ఫుట్‌బాల్ శిక్షణా శిబిరం బుధవారంతో ముగిసింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సహకారంతో నిర్వహించిన శిక్షణా శిబిరం విజయవంతం అయిందన్నారు. కప్‌ను సాధించి మంత్రి ఆర్కే రోజాకు బహుమతిగా అందించాలని కోరారు. కార్యక్రమంలో కోచ్‌లు నవీన్‌కుమార్, వినోద్‌కుమార్, చిత్తూరు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఉదయ్, తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి బాబు, పీడీలు ప్రభాకర్, రాజా, ప్రేమ్, అశ్విని, 22 మంది జట్టు సభ్యులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత



పుత్తూరులో పౌష్టికాహారం తింటున్న గర్భిణులు, (ఇన్‌సెట్) చిన్నారికి భోజనం తినిపిస్తున్న మహిళ



నగరి : ప్రభుత్వ ఆస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు బుధవారం రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉచితంగా పౌష్టికాహారం అందించారు. పరీక్షల సమయంలో ఆస్పత్రిలో ఉండాల్సి వచ్చే వారు భోజనానికి ఎలాంటి ఇబ్బందులు పడకూడదని మంత్రి ఆర్కేరోజా ఉచితంగా భోజనం అందించే ఈ ప్రక్రియను నిరంతరాయంగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు, వారితో పాటు వచ్చిన పెద్దలు, పిల్లలకు ఉచితంగా వెజిటబుల్ రైస్, గుడ్డు, పుదీన చట్నీ, చిక్కీ, అరటిపండు, రైతాతో కూడిన పౌష్టికాహారం అందించారు. మెడికల్ సూపరింటెండెంట్ బాలకృష్ణనాయక్, ఆర్‌ఎంఓ గోపాల్, మెడికల్ సూపరింటెండెంట్ రాజారత్నమ్మ గర్భిణులకు భోజనం పంపిణీ చేశారు.

పుత్తూరులో..

పుత్తూరు రూరల్: స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా వితరణతో ప్రతి బుధవారం పుత్తూరు, నగరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుమారు 400 మందికి పైగా పౌష్టికాహారం అందజేస్తున్నారు. ఆస్పత్రికి పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు ప్రతి వారం రోజా చారిటబుల్ ట్రస్టు తరఫున క్రమం తప్పకుండా అందిస్తున్నారు. దీనిపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ నాయకులు, హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్స్, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై వేణుగోపాలుడి చిద్విలాసం



తిరుచ్చి వాహనంపై దర్శనమిస్తున్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుడు



ఉభయ దేవేరులతో పాటు స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న వేదపండితులు

కార్వేటినగరం: మండలకేంద్రంలోని ప్రసిద్ధి రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి వారు బుధవారం ఉగాది ఉత్సవాల్లో భాగంగా తిరుచ్చి వాహనంపై గ్రామవీధుల్లో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వేకువజామున అర్చకులు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం 9.30 నుంచి 10.30 గంటల నడుమ స్వామివారి ఉత్సవమూర్తులకు పండితులు వేద మంత్రాలు పఠిస్తూ స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం 4 గంటలకు వేదపడింతులు పంచాంగ శ్రవణం పఠించారు. సాయంత్రం 5.30 నుంచి 7.30 గంటల మధ్య ఉభయ దేవేరులతో పాటు శ్రీ వేణుగోపాలస్వామి వారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై ప్రతిష్టించి గ్రామ వీధుల్లో మంగళవాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి 8.30 ఏకాంతసేవ నిర్వహించి స్వామివారిని పవళింపజేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఏకాంబరం, టీటీడీ ఆలయ అధికారి సురేష్‌కుమార్, అర్చకులు గోపాలాచారి, కిరణ్‌భట్టాచార్యులు, టీటీడీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

నేషనల్ హైవే అధికారుల మొండివైఖరి నశించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నగరి : జాతీయ రహదారి అధికారుల మొండివైఖరి నశించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జాతీయ రహదారుల కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుత్తూరు–చెన్నై ఫోర్ లైన్ రోడ్డు వేయకపోవడం, రోడ్డు మరమ్మతుల పేరిట ప్రమాద సూచికలను ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతోందన్నారు. నెలరోజుల క్రితం జాతీయ రహదారుల మరమ్మతుల పేరిట రోడ్లు వేయడం జరిగిందని, కానీ రోడ్డు వేసిన తరువాత అధికారులు రోడ్లపైన వైట్ మార్కింగ్, ప్రమాద సూచిక బోర్డులను ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయలేదన్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారి అధికారులు రోడ్లపై వైట్ లైన్ మార్కింగులు వేసి ప్రమాద సూచికలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు , యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

31న ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ ప్రారంభం

- రూ.10 కోట్లతో నిర్మించిన దాత
- అగర్‌బత్తీల ప్లాంట్ విస్తరణ పనులు పూర్తి
- రోజుకు 40 వేల ప్యాకెట్ల ఉత్పత్తి



అగర్‌బత్తీల తయారీలో నిమగ్నమైన మహిళలు

తిరుపతి రూరల్: టీటీడీ ఆధ్వర్యంలోని శ్రీవెంకటేశ్వర గోసంరక్షణశాలలో నూతనంగా నిర్మించిన ఫీడ్ మిక్సింగ్ ప్లాంటు, అగర్‌బత్తీల ప్లాంట్ విస్తరణ కేంద్రాన్ని ఈ నెల 31న ప్రారంభించనున్నారు. ఈ నెల మొదటి వారంలోనే ప్రారంభించేందుకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో వాయిదా పడింది. కోడ్ ఎత్తివేసిన నేపథ్యంలో ఈ నెల 31న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా వీటిని ప్రారంభించనున్నారు.

రూ.10 కోట్లతో ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్

టీటీడీ పరిధిలోని గోశాలలో ప్రస్తుతం మూడు వేలకు పైగా పశువులను సంరక్షిస్తున్నారు. వీటికి రోజుకు దాదాపు 2500 నుంచి 3 వేల కిలోల వరకు దాణా అవసరమవుతోంది. అంతేకాకుండా వాటి ఆరోగ్య సంరక్షణ, పాల ఉత్పత్తి పెంపు, పాలల్లో నాణ్యమైన వెన్నశాతం ఉండేలా పోషకాలతో నిండిన దాణా అందించాలని టీటీడీ పాలక మండలి సభ్యులు, ఈవో ధర్మారెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపారు. అందులో భాగంగా ఎస్వీ వెటర్నరీ వర్సిటీ సాంకేతిక భాగస్వామ్యంతో ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రూ.10 కోట్ల ఖర్చయ్యే ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు దాత ముందుకు వచ్చారు. టీటీడీ పైసా ఖర్చు లేకుండా దాత సహకారంతోనే దీన్ని ఏర్పాటు చేశారు. ఇందులో రోజుకు 4 వేల నుంచి 6 వేల కిలోల దాణాను తయారు చేసేందుకు అవకాశం ఉంది.

డిమాండ్‌కు అనుగుణంగా అగర్‌బత్తీల తయారీ



అగర్‌బత్తీల తయారీ కోసం పూలను సిద్ధం చేస్తున్న మహిళలు(ఇన్‌సెట్) తయారు చేసిన అగర్‌బత్తీలు



టీటీడీ పరిధిలోని ఆలయాల్లో దేవుళ్ల సేవకు ఉపయోగించిన పూలతో తయారు చేస్తున్న అగర్‌బత్తీలకు దేశ, విదేశాల్లోని భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. దర్శన్ ఇంటర్నేషనల్ సంస్థ సహకారంతో తయారు చేస్తున్న ఈ అగర్‌బత్తీలకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా అగర్‌బత్తీలను అందించేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. ఈ క్రమంలో ప్లాంట్ విస్తరణ పనులను దర్శన్ సంస్థ చేపట్టింది. రోజుకు 40 వేల నుంచి 45 వేల ప్యాకెట్ల అగర్‌బత్తీల తయారీకి ఏర్పాట్లు చేసింది. ప్రస్తుతం రోజుకు 15 వేల ప్యాకెట్ల అగర్‌బత్తీలను మాత్రమే తయారు చేస్తున్నారు. వీటిని భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చిన గంటలోనే అమ్ముడుపోతున్నాయి. అంతేకాకుండా టీటీడీ ఆలయాల నుంచి ప్రస్తుతం రోజుకు 700 నుంచి 1000 కిలోల పూలను సేకరిస్తున్నారు. పెరిగిన అగర్‌బత్తీల సామర్థ్యం మేరకు ప్రతి రోజూ 1700 కిలోల పూలు అవసరమవుతాయని టీటీడీ అధికారులు గుర్తించారు. దీంతో తిరుపతితో పాటు ఒంటిమిట్ట, నాగలాపురం, నారాయణవనం, అప్పలాయిగుంట ఆలయాల నుంచి పూలను సేకరించనున్నట్లు టీటీడీ జేఈఓ సదాభార్గవి తెలిపారు.